క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న పోలీసులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ కమాన్ సమీపంలోని చిరు వ్యాపారులకు మంగళవారం పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎవరైనా.. అఘంతకులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పొద్దని తెలిపారు. తెలియని వ్యక్తులకు ఫోన్ ఇవ్వరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది బన్సిలాల్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినకర్, ఉపాధ్యక్షుడు పాపయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దశంకరంపేటలో వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవన కిరాయిలు చెల్లించలేక ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నారని, సీఎం స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దత్తు, సాయికుమార్, దుర్గేశ్‌కుమార్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయనిధి) పేదలకు వరం అని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లో పెద్దశంకరంపేట మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌కు మంజూరైన రూ.30 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పథకాలను అందరికి అందజేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పెరుమాండ్లగౌడ్, సత్యనారాయణరావు, మాజీ ఎంపీటీసీ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలన



రోగిని పరీక్షిస్తున్న కోఆర్డినేటర్ శివదయాల్

రామాయంపేట(మెదక్): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ శివదయాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించి పేషంట్లతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. కోఆర్డినేటర్ స్వయంగా ఇన్ పేషంట్లను పరిశీలించి, జాగ్రత్త చర్యలు వివరించారు. డాక్టర్లు, ఇతర సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి, ఇతర డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తులు అందజేత

నర్సాపూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలు జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులందరూ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ఇంతియాజ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లేరు గడ్డలతో ఉపాధి

● రత్నపూర్, పిల్లుట్లల్లో సేకరణ

శివ్వంపేట(నర్సాపూర్): సహజ సిద్ధంగా అటవీ ప్రాంతంలో లభించే ఎల్లేరు గడ్డలతో పలువురు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుత సీజన్‌లోనే లభించే ఎల్లేరు గడ్డల సేకరణకు పలువురు తీవ్రంగా కష్టపడుతూ ఉపాధి పొందుతున్నారు. మండల పరిధిలోని రత్నపూర్, పిల్లుట్ల, శివ్వంపేట అడవీ ప్రాంతంలో పలువురు గ్రామస్తులు భూమిపై కనిపించే ఎల్లేరు తీగను గుర్తించి గజం లోతు వరకు తవ్వకం చేసి భూమిలో నుంచి గడ్డలను సేకరిస్తారు. సేకరించిన గడ్డలను ముక్కలుగా చేసి పొయ్యిపై సన్నటి మంట పెట్టి గంటల తరబడి ఉడికిస్తారు. పిండి ముద్దగా మారిన అనంతరం వాటిని వివిధ గ్రామాల్లో విక్రయిస్తూ ఆర్థికంగా ఉపాధి పొందుతున్నారు.

పుష్కలంగా పోషక విలువలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎల్లేరు గడ్డలు

ప్రస్తుత సీజన్‌లో దొరికే ఎల్లేరు గడ్డల్లో పోషక విలువలు పుష్కలంగా ఉండడంతో మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. మండలంలోని అటవీ ప్రాంతంలో సేకరించిన ఈ గడ్డలను శివ్వంపేట, నర్సాపూర్, తూప్రాన్, మేడ్చెల్, హైదరాబాదు ప్రాంతాల్లో కిలో రూ.200లకు విక్రయిస్తుంటారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో మాత్రమే ఇవి దొరుకుతాయి.

ఆరోగ్యానికి మంచిది



సహజ సిద్ధంగా అటవీ ప్రాంతంలో దొరికే ఎల్లేరు గడ్డలు తినడం ఆరోగ్యానికి చాలా మంచింది. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే విరివిగా లభ్యమయ్యే వాటిని సేకరించడం కష్టంగా ఉంటుంది. సీజనల్‌గా భూమిలో నుంచి లభించే వాటిల్లో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి.

– శ్యామ్ సుందర్, ఆయుర్వేదిక్ వైద్యుడు

పశువులకు టీకాలు వేయించండి

● జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి వెంకటయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి వెంకటయ్య అన్నారు. మంగళవారం కౌడిపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం పశువుల ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా వేస్తుందని తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకడం వల్ల పాల ఉత్పత్తి తగ్గి రైతులకు నష్టం జరుగుతుందన్నారు. అపోహలు నమ్మొద్దని పశువులకు టీకాలు ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రాజు, జేవీఓ సుదర్శన్, ఎల్ఎస్ఏ వీరారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, సుజాత, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరెపల్లిలో..

పాపన్నపేట(మెదక్): మండలంలోని ఆరెపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో జేవీఓ సలావుద్దీన్, సిబ్బంది యాదయ్య, బాలరాజు పాల్గొన్నారు.



కౌడిపల్లి పశువుల ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి వెంకటయ్య



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

మండలంలో 19 కొనుగోలు కేంద్రాలు

కొల్చారం(నర్సాపూర్): రైతుల నుంచి వానాకాలం వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు మండల వ్యాప్తంగా 19 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈసారి ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యానికి అదనంగా క్వింటాల్‌కు బోనస్ రూ.500 ప్రకటించారు. ఇందుకోసం సన్న, దొడ్డు రకాల కొనుగోలుకు వేర్వేరుగా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. సన్నరకం ధాన్యాన్ని పండించిన రైతులు బోనస్ రావాలన్న వారికి కేటాయించిన కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాల్సి ఉంటుందని మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. మండలంలో దొడ్డు, సన్నాల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు ఈ విధంగా ఉన్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్)చిన్నఘనాపూర్, రాంపూర్, రంగంపేట, తుక్కాపూర్, ఏటిగడ్డ మాందాపూర్, దొడ్డురకం కొనుగోలు చేసే కేంద్రాలు పీఏసీఎస్‌ల పరిధిలో కిష్టాపూర్, కొంగోడ్, నాయిని జలాల్పూర్, కొల్చారం అప్పాజీపల్లి, పైతర, వరిగుంతం, సీతారాం తండా, ఐకేపీ పోతంశెట్టిపల్లి, వెంకటాపూర్, ఎఫ్‌పీఓ ఎనగండ్ల, సన్నరకం కొనుగోలు చేసే కేంద్రాలు కోనాపూర్, సంగాయిపేట, పోతంశెట్టిపల్లి ఉన్నాయి.

విద్యార్థుల ఇళ్లకు టీచర్లు



కొత్తపల్లిలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న టీచర్లు

పాపన్నపేట(మెదక్): బడికి రండి బాబు అంటూ.. మండల కేందంలో మంగళవారం టీచర్లు విద్యార్థుల ఇంటిబాట పట్టారు. ప్రభుత్వ పాఠశాలలకు ఈ నెల 2 నుంచి 14 వరకు దసరా సెలవులు ఇచ్చారు. మంగళవారం పాఠశాలలు తెరిచారు. కానీ విద్యార్థులు తక్కువ సంఖ్యలో వచ్చారు. దీంతో పాపన్నపేట ఉన్నత పాఠశాలకు చెందిన టీచర్లు మంగ నర్సింలు, కృష్ణకాంత్, సంగప్ప, మోహన్‌రావు నర్సింగరావుపల్లి, మొదల్లకుంట, మదిర కొత్తపల్లి గ్రామల్లోని విద్యార్థుల ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు. క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాలని వారి తల్లిదండ్రులకు సూచించారు.

ఇసుక లారీ పట్టివేత

మిరుదొడ్డి(దుబ్బాక): ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బోయిని పరశురాములు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అందె గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. లారీ యజమాని కూర అనిల్ కుమార్, డ్రైవర్ దేశెట్టి చింటుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో నల్లాలు ధ్వంసం



ముప్పిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ధ్వంసం చేసిన నల్లాలు

మనోహరాబాద్(తూప్రాన్): దసరా సెలవులకు పాఠశాల మూతపడిగా, గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలో నల్లాలు, తలుపులకు వేసినా తాళాలను పగలగొట్టారు. ఈ సంఘటన మండలంలోని ముప్పిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంది. మంగళవారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు తాళాలు, నల్లాలు తదితర వాటిని పగలగొట్టినట్లు గుర్తించి గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

కుల బహిష్కరణ సరికాదు

సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు

నర్సాపూర్ రూరల్: కుల బహిష్కరణ సరికాదని సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్‌లో ఓ కులం సభ్యులు అదే కులానికి చెందిన రెండు కుటుంబాలను బహిష్కరించి, ఇబ్బందులు పెడుతున్నట్లు చెప్పారు. అలా కుల బహిష్కరణ చేయడంతో మానసిక వేదనకు గురయ్యే అవకాశం ఉందన్నారు. బాధితులతో కలిసి పోలీసులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నేటికీ అనేక గ్రామాల్లో కుల బహిష్కరణలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు.



బాధితులతో నాగరాజు

అవకతవకలకు పాల్పడితే సహించేది లేదు

డీఆర్‌డీఓ పీడీ జయదేవ్‌ఆర్య

దుబ్బాకరూరల్: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని డీఆర్‌డీఓ పీడీ జయదేవ్‌ఆర్య హెచ్చరించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నర్సరీలలో మొక్కల పెంపకానికి ప్లాస్టిక్ వకర్లు, మట్టిని సిద్ధం చేసుకోవాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలని, వాటికి నీటిని క్రమం తప్పకుండా పట్టాలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని చెప్పారు. అనంతరం మండలంలోని అప్పనపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.



మాట్లాడుతున్న జయదేవ్‌ఆర్య

సంక్షిప్త వార్తలు

◆ **బీజేపీ సభ్యత్వ నమోదు**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నగనాపూర్ గ్రామంలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ హాజరై మొబైల్లో ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తమ పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాని, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రవికాంత్, బూత్ అధ్యక్షులు బాబాగౌడ్, మహేశ్, కృష్ణ, మల్లేశం, పెంటయ్య పాల్గొన్నారు.

◆ **నస్కల్‌లో ఇందిరమ్మ కమిటీ**

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో కాంగ్రెస్ పిలుపు మేరకు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీని వేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటుకు ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందించారు. కమిటీ సభ్యులు పుష్పలత, జ్యోతి, మెట్టు వెంకట్, జలంధర్, మహమ్మద్ షానమద్ ఎంపికయ్యారు. దేవరాజు, రవి, దేవరాజు, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ అతిపెద్ద పార్టీ**

పాపన్నపేట(మెదక్): బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అని పార్టీ జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జి మురళీధర్ అన్నారు. మంగళవారం పాపన్నపేటలో బీజేపీ సభ్యత్వ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలంతా భారీ సభ్యత్వాలను నమోదు చేయాలని కోరారు. దేశం, ధర్మం కోసం ప్రతీ కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నందారెడ్డి, మండలాధ్యక్షుడు రాములు, మాజీ సర్పంచ్ ఇమాన్యుల్, నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **బీవీ రాజు బహుముఖ ప్రజ్ఞాశాలి**



నర్సాపూర్: పద్మభూషణ్ దివంగత డా. బీవీ రాజును బహుముఖ ప్రజ్ఞాశాలిగా శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరి ఆదిత్యవిస్సాం అన్నారు. బీవీ రాజు జయంతిని పురస్కరించుకొని సొసైటీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో కొనసాగుతున్న బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీ సిబ్బందికి ఆయన దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు, ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎమ్మెల్సీ ఎన్నికలపై శిక్షణ**

తూప్రాన్: ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలకు ఆర్డీఓ జయచంద్రారెడ్డి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా నవంబర్ 6 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

◆ **దరఖాస్తులకు ఆహ్వానం**

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకనామిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ(పీజీటీ) పోస్టులకు బీఈడీ పూర్తి చేసి ఉండాలని, అర్హత కలిగిన వారు పాఠశాలలో బుధవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

పరిశుభ్రమైన నీటినే సరఫరా చేయాలి

● మండల ప్రత్యేక అధికారి డీఎల్‌పీఓ సురేశ్‌బాబు

పాపన్నపేట(మెదక్): గ్రామాల్లో అంతరాయం లేకుండా పరిశుభ్రమైన నీటినే సరఫరా చేయాలని మండల ప్రత్యేక అధికారి డీఎల్‌పీఓ సురేశ్‌బాబు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నీటి సహాయకులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సరఫరా మరమ్మతుల మెళకువలను వివరించారు. నీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ విష్ణువర్ధన్, ఏఈ సురేష్, ఎంపీఓ పరమేశ్వర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

వాటర్‌మెన్‌లకు శిక్షణ

కౌడిపల్లి(నర్సాపూర్): రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కౌడిపల్లి రైతువేదికలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో వాటర్‌మెన్‌లకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్యాంక్ వద్ద, పైప్‌లైన్ వద్ద లీకేజీలు లేకుండా చూడాలన్నారు. మోటార్, స్టాటర్ రిపేర్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సంపత్, డీఈ శ్రీనివాస్, ఏఈ అన్వేష్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్



పాపన్నపేట(మెదక్): మాట్లాడుతున్న సురేశ్‌బాబు

సస్యరక్షణ చర్యలు పాటించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు వరి పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏఓ స్వప్న అన్నారు. మంగళవారం మండలంలోని ముత్రాజ్‌పల్లిలో పలువురు రైతుల వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో మెడవిరుపు తెగులు గమనించినట్లు చెప్పారు. నివారణ కోసం ఎకరానికి పికోక్సీస్ట్రోబిన్, ట్రైటసైక్లాజోల్ 400ఎంఎల్ లేదా ట్రైసైక్లాజోల్, మాంకోజెట్ 500గ్రాములు 200లీటర్ల నీటికి కలిపి స్ప్రే చేయాలని తెలిపారు. ప్రతీరోజు రైతులు పంటను గమనించాలన్నారు. పంటలో మార్పులు గమనిస్తే, వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.



ముత్రాజ్‌పల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

విద్యార్థుల నిరసన



నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

రామాయంపేట(మెదక్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, లెక్చరర్లు మంగళవారం పట్టణంలో నిరసన నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్లుగా ప్రభుత్వం ఉపకార వేతనాలను విడుదల చేయకపోడంతో ప్రైవేట్ కళాశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయని వాపోయారు. ఇప్పటికే చాలా ప్రైవేట్ కళాశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులు, డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న లెక్చరర్లు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

నర్సాపూర్‌లో విద్యార్థుల రాస్తారోకో

నర్సాపూర్ రూరల్: ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్‌లు విడుదల చేయాలని మంగళవారం నర్సాపూర్ చౌరస్తాలో విద్యార్థులు నిరసన తెలిపారు. ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలకు మద్దతుగా రాస్తారోకో చేస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అక్షయగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్ల నుంచి ప్రభుత్వం కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ ఇవ్వకుండా జాప్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల మేనేజ్మెంట్, కార్యవర్గ సభ్యులు అశోక్ కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలోని వీరహనుమాన్ దేవాలయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు పూజల్లో భాగంగా కలశస్థాపన, గణపతిపూజ, గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎం.జలాల్‌పూర్ గ్రామ శివారులో..

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎం.జలాల్‌పూర్ గ్రామ శివారులో మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు మంగళవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. గతంలోనే విగ్రహం ప్రతిష్ఠించగా, దాతల సహకారంతో మందిర నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఆలయ నిర్వాహకులు సత్యనారాయణ పేర్కొన్నారు.



చేగుంట(తూప్రాన్): చందాయిపేటలో హనుమాన్ ఆలయ వార్షికోత్సవ కలశపూజ

ఫస్ట్ ఇచ్చిన ఆర్డర్లను కొనసాగించండి

మెదక్ కలెక్టరేట్: విద్యుత్‌శాఖ బదిలీల్లో భాగంగా మొదట ఇచ్చిన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లనే కొనసాగించాలని టీఆర్వీకేఎస్327 యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి మెదక్ జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందు ఇచ్చిన బదిలీ ఆర్డర్లను కాదని, ఒక యూనియన్ చెప్పిన మాటలు వింటూ విద్యుత్ శాఖలో బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. ఇది సరికాదని మొదట ఇచ్చిన ఆర్డర్లనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి, వాస్తవ పరిస్థితులను ఆధీనంలోకి తీసుకొని బదిలీలు చేపట్టాలని టీఆర్వీకేఎస్327 యూనియన్ నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, రాజేశ్వరరావు, అశోక్, ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నేతలు

భూ నిర్వాసితులు సర్వేకు సహకరించాలి

● అభ్యంతరాలు తెలిపేందుకు రాని రెడ్డిపల్లి భూ నిర్వాసితులు

నర్సాపూర్ రూరల్: ట్రిపుల్‌ఆర్ కోసం భూములు కోల్పోతున్న రెడ్డిపల్లి భూ నిర్వాసితులు సర్వేకు సహకరించాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి కోరారు. ట్రిపుల్ ఆర్ కోసం భూములు కోల్పోతున్న రైతులతో మంగళవారం నర్సాపూర్ రైతు వేదికలో అభ్యంతరాల కోసం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెడ్డిపల్లి, కొంతాన్‌పల్లి భూ నిర్వాహకులు హాజరు కావాలని అధికారులు సూచించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు రెడ్డిపల్లి రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలతో హాజరు కావాల్సిఉండగా, కొంతమంది రైతులు వచ్చి పత్రాలు ఇవ్వకుండా వెళ్లిపోయారు. మధ్యాహ్నం జరిగిన అవార్డు ఎంక్వైరీ కొంతాన్‌పల్లి రైతులు వచ్చి తమ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఓపెన్ మార్కెట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఆర్డీఓను కోరారు. సర్వేకు సహకరించకుంటే త్రీడీ సర్వే ప్రకారం భూములు సేకరించడం జరుగుతుందని ఆర్డీఓ చెప్పారు. ఇప్పటికే రెడ్డిపల్లి భూ నిర్వాసితులకు పలుమార్లు నోటీసులు ఇచ్చామని, భూ నిర్వాసితులకు నష్టం జరగకుండా చూస్తామన్నారు.



ఆర్డీఓకు పత్రాలు సమర్పిస్తున్న కొంతాన్‌పల్లి రైతులు